కేటీఆర్‌ను కలిసిన మాజీ జడ్పీటీసీ

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను జడ్పీటీసీల ఫోరం రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి శనివారం తెలంగాణ భవన్‌లో కలిశారు. ఈ సందర్భంగా మండలంలోని చిన్న ఆత్మకూర్, కన్నారెడ్డి గ్రామ పంచాయతీల ఏర్పాటు గత ప్రభుత్వ చొరవతోనే జరిగిందని కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు కేసీఆర్‌ను ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటారన్నారు.

– నాగిరెడ్డిపేట, ఆగస్టు 10

పీజీ ఎంట్రెన్స్‌లో సాందీపని, ఆర్‌కే కళాశాలల ప్రతిభ

కామారెడ్డి, ఆగస్టు 10 : పీజీ ఎంట్రెన్స్‌లో సాందీపని, ఆర్‌కే కళాశాలల విద్యార్థులు రాష్ట్ర ర్యాంకులు సాధించారు. ఆర్.కే కళాశాల విద్యార్థిని మానస ఎంఏ పొలిటికల్ సైన్స్ విభాగంలో రాష్ట్ర 24వ ర్యాంకు, గంగోత్రి ఎంమ్మెస్సీ ఫిజిక్స్ విభాగంలో రాష్ట్ర 79వ ర్యాంకుతో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. సాందీపని కళాశాల విద్యార్థులు కంప్యూటర్ సైన్స్ విభాగంలో హితేష్ సేనారెడ్డి రాష్ట్ర 3వ ర్యాం కు, ఫిజిక్స్ విభాగంలో సిమ్రాన్ రాష్ట్ర 21వ ర్యాంకు, వెన్నెల 82, నందిని 105, ఝాన్సీ 200వ ర్యాంకు, హిందీ విభాగంలో సరిత 92వ ర్యాంకు, డాటా సైన్స్ విభాగంలో అథీనా ముస్కాన్ 234, పొలిటికల్ సైన్స్ విభాగంలో బాబూలాల్ 330, రవితేజ 432, హిస్టరీ విభాగంలో స్వాతి 465వ ర్యాంకులు సాధించారు. వీరిని సాందీపని కళాశాల డైరెక్టర్ హరిస్మరణ్ రెడ్డి, ప్రిన్సిపాల్ సాయిబాబు, ఆర్‌కే కళాశాల సీఈవో జైపాల్‌రెడ్డి, డీన్ నవీన్ కుమార్, ప్రిన్సిపాల్ సైదయ్య, గోవర్ధన్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

రోడ్డుపై ఆటోలు నిలుపొద్దు

బాన్సువాడ పట్టణ సీఐని సన్మానిస్తున్న ఆటో స్టాండ్ సభ్యులు

బాన్సువాడ, ఆగస్టు 10 : పట్టణంలోని బస్టాండ్, అంబేద్కర్ చౌరస్తా, ప్రధాన రహదారిపై ఆటోలను ఇష్టానుసారంగా నిలిపి వాహనదారులను ఇబ్బందులకు గురిచేయవద్దని పట్టణ సీఐ కృష్ణ ఆటో యూనియన్ సభ్యులకు శనివారం సూచించా రు. మైనార్టీ ఫంక్షన్ హాల్ అధ్యక్షుడు వాహబ్ ఆధ్వర్యంలో యూనియన్ సభ్యులు సీఐని కలిసి శాలువా తో సన్మానించారు. కార్యక్రమంలో సయ్యద్, రెహాన్, సాయిలు, ప్రేమ్‌కుమార్, హుస్సేన్, సాయి, విజయ్, హైమద్, ఇబ్రహీం, ఆమేర్, అష్రఫ్, వసీం తదితరులు పాల్గొన్నారు.

హాజీపూర్‌లో వైద్య శిబిరం

నస్రుల్లాబాద్, ఆగస్టు 10 : మండలంలోని హాజీపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిజామాబాద్ మెడికవర్ దవాఖాన సహకారంతో ఉచిత మెగా హెల్త్ క్యాంప్‌ను శనివారం నిర్వహించారు. డాక్టర్ విష్ణు ప్రజలకు పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ విఠల్, గ్రూప్ ఆఫ్ హెల్పింగ్ ఫ్రెండ్స్ అధ్యక్షుడు నరేశ్, మాజీ సర్పంచ్ అంజ య్య, నాయకులు విఠల్, భాస్కర్, కిషన్ పాల్గొన్నారు.

వాలీబాల్, కబడ్డీ పోటీలు ప్రారంభం

భిక్కనూరు, ఆగస్టు 10 : మండల కేంద్రంలో వాలీబాల్, కబడ్డీ పోటీలను ఎస్సై సాయికుమార్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడలు స్నేహపూర్వకంగా ఆడుకోవాలన్నారు. ఓటమి చెందిన వారు నిరుత్సాహపడకుండా గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎస్సై సాయికుమార్

ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్‌ను సన్మానిస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

కామారెడ్డి, ఆగస్టు 10 : రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజును కామారెడ్డి జిల్లా కోర్టు బార్ అసోసియేషన్ న్యాయవాదులు బాన్సువాడలోని ఆయన నివాసంలో శనివారం కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాలరాజు మాట్లాడుతూ.. సంస్థ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షుడు కావేటి శ్యాంగోపాల్ రావు, గజ్జల భిక్షపతి, బోరెడ్డి దామోదర్ రెడ్డి, సీనియర్ న్యాయవాది తాటి చంద్రశేఖర్, బాన్సువాడ సీనియర్ న్యాయవాదులు రమాకాంత్, లక్ష్మీ నారాయణమూర్తి పాల్గొన్నారు.

ఓటుహక్కు వినియోగంపై అవగాహన

నస్రుల్లాబాద్, ఆగస్టు 10 : నస్రుల్లాబాద్ మండలం దుర్కి, కాంశెట్‌పల్లి, మిర్జాపూర్, బస్వాయిపల్లి గ్రామాల్లో యువజన కాంగ్రెస్ సన్నాహక సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో యువకులకు అవగాహన కల్పించారు. మైనారిటీ విభాగం జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ ఖలేక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అసద్ బిన్ మోసిన్, మైనారిటీ మండల అధ్యక్షుడు యూసుఫ్, ఏఎంసీ మాజీ చైర్మన్ పెర్క శ్రీనివాస్, నాయకులు శ్యామల, రాము, వెంకటి, యువకులు పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు..

బాన్సువాడ రూరల్, ఆగస్టు 10 : బాన్సువాడ మండలంలోని బోర్లం క్యాంపు తండాలో వీధి కుక్కల బెడద గ్రామస్తులను భయాందోళనకు గురి చేస్తున్నది. గ్రామంలో ఎక్కడా చూసి నా గుంపులు, గుంపులుగా వీధి కుక్కలు తిరుగుతూ గ్రామస్తులపై దాడులు చేస్తున్నాయి. చిన్న పిల్లలను బయటికి పంపాలంటే జంకుతున్నారు. రాత్రిపూట బయటికి వెళ్లాలంటే కుక్కల సంచారంతో గ్రామస్తులు భయభ్రాంతులకు గురవుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వీధి కుక్కల బెడదను నివారించాలని కోరుతున్నారు.

బోర్లం క్యాంపు తండా గ్రామంలో రోడ్లపై గుంపులుగా సంచరిస్తున్న వీధి కుక్కలు

క్లాథ్ మర్చెంట్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

కామారెడ్డిలో మాట్లాడుతున్న నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా

ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి, ఆగస్టు 10 : మార్కెట్ పోటీని తట్టుకుంటూ వ్యాపారం చేయాలని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయ ణగుప్తా అన్నారు. శనివారం కామారెడ్డి క్లాథ్ మర్చెంట్ అసోసి యేషన్ (బట్టల వర్తక సంఘం) నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తన తల్లిదండ్రుల పేరిట కామారెడ్డి బట్టల వర్తక సంఘ భవనానికి తగిన విధంగా విరాళం అందజేస్తానని అన్నారు. కార్యక్రమం లో నూతన అధ్యక్షుడు తాటి పాముల సందీప్, చైర్మన్ గడీల నర్సింహు లు, ప్రధాన కార్యదర్శి రాజు, కోశాధికారి వెంకటేశం, ఉపాధ్యక్షుడు ఎల్‌వి.ప్రసాద్ పాల్గొన్నారు.

బాన్సువాడ రూరల్ మండల పీఆర్టీయూ..

బాన్సువాడ రూరల్, ఆగస్టు 10 : బాన్సువాడ మండల రూరల్ పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని పీఆర్టీయూ భవనంలో సంఘం సభ్యుల సమక్షంలో శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శులుగా రామకృష్ణ, సంతోష్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రవీణ్, వైస్ ప్రెసిడెంట్‌గా గంగమణి, సంయుక్త కార్య దర్శులుగా చంద్రకాంత్, సౌజన్యను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన సభ్యులు ప్రమాణస్వీ కారం చేశారు. ఉపాధ్యాయుల సమస్యల కోసం సంఘ సభ్యులతో కలిసి పోరాడుతామని అధ్యక్ష, కార్యదర్శులు పేర్కొన్నారు.

ఆలయంలో పోచారం ప్రత్యేక పూజలు

ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు

నస్రుల్లాబాద్, ఆగస్టు 10 : బీర్కూర్ తెలంగాణ తిరుమల తిరుపతి దేవస్థానంలో శ్రావణ మాసం మొదటి శనివారం సందర్భంగా బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి దంపతులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయంలో వారు ప్రత్యేక పూజలు చేశారు.

కిటకిటలాడిన ఆలయాలు..

బాన్సువాడ, ఆగస్టు 10 : బాన్సువాడతోపాటు బీర్కూర్ వెంకటేశ్వరస్వామి, నెమ్లి సాయిబాబా, ఆయా మండలాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ శనివారం పుర్కరించుకొని భక్తులు వీరాంజనేయస్వామి, సోమలింగేశ్వర, మద్నూర్ సలాబాత్‌పూర్ హనుమాన్, బుగ్గ రామేశ్వరం తదితర ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

పుస్తె, మెట్టెలు అందజేత

మాచారెడ్డిలో పుస్తె మెట్టెలు పంపిణీ చేస్తున్న నాయకులు

మాచారెడ్డి, ఆగస్టు 10 : మండల కేంద్రానికి చెందిన డీకొండ దేవలక్ష్మి కూతురు వైష్ణవి వివాహానికి శ్రీలక్ష్మీనర్సింహా చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ ముత్యాల నర్సింహారెడ్డి తరపున శనివారం పుస్తె, మెట్టెలను అందజేశారు. మాజీ ఎంపీపీ నర్సింగ్‌రావు వివాహ ఖర్చులకుగాను రూ.20 వేలు అందజేశారు. కార్యక్రమంలో నవీన్‌రెడ్డి, రామ్మోహన్, రాజిరెడ్డి, ఎర్రోళ్ల నవీన్, కిషన్‌గౌడ్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు డియాక్టివేషన్ అంటూ మోసం

కార్డు నుంచి రూ.67,700 మాయం

మాచారెడ్డి, ఆగస్టు 10 : ఆర్బీఎల్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ ఆర్బీఎల్ క్రెడిట్ కార్డు యాక్టివేషన్‌లో ఉంది.. దాన్ని డియాక్టివేషన్ చేయాలంటూ గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి అకౌంట్ నుంచి డబ్బులు కాజేసిన ఘటన మాచారెడ్డి మండలంలోని కాకులగుట్టతండా గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్సై అనిల్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన భూక్య సంతోష్‌కు కొత్త నంబర్ నుంచి ఫోన్ చేసిన వ్యక్తులు మేము ఆర్బీఎల్ బ్యాంక్ నుంచి మాట్లాడుతున్నామని, మీ పేరు మీద ఆర్బీఎల్ బ్యాంక్‌కు చెందిన క్రెడిట్ కార్డు యాక్టివేషన్‌లో ఉన్నదని, సంవత్సరానికి చార్జ్ పడుతుందన్నారు. దీంతో తనకు అవసరం లేదని డియాక్టివేషన్ చేయాలని బాధితుడు సంతోష్ గుర్తు తెలియని వ్యక్తులతో మాట్లాడగా వాట్సాప్‌లో ఏపీకే ఫైల్ పంపిస్తామని దానిని ఓపెన్ చేస్తే డియాక్టివేషన్ అవుతుందని చెప్పారు. దీంతో సంతోష్ అలాగే చేయగా తనవద్ద ఉన్న ఎస్బీఐ క్రెడిట్ కార్డు నుంచి రూ.67,700 మాయమైయ్యాయి. తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఎస్సై వివరించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి బ్యాంక్ వివరాలు, ఓటీపీలు అడిగితే చెప్పవద్దని, అనవసరమైన లింక్‌లను క్లిక్ చేయవద్దని ఎస్సై సూచించారు.

పోచారం ప్రాజెక్టులో 16 ఫీట్లకు చేరిన నీరు

పోచారం ప్రాజెక్టులో నిల్వ ఉన్న నీరు, ఇన్‌సెట్‌లో నీటిమట్టం

పోచారం, ఆగస్టు 10: పోచారం ప్రాజెక్టులోకి వరద వచ్చి చేరడంతో జలకళను సంతరించుకుంటున్నది. ప్రాజెక్టులో శనివారం 16 ఫీట్లతో 1.105 టీఎంసీల నీరు నిల్వ ఉన్నదని నీటిపారుదల శాఖ డీఈఈ వెంకటేశ్వర్లు తెలిపారు. ప్రాజెక్టు ఎగువన ఉన్న లింగంపేట పెద్దవాగు ద్వారా 300క్యూసెక్కుల వరద ప్రాజెక్టులోకి వచ్చి చేరుతుందన్నారు. ఆగస్టు15లోపు నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి మండలాల్లోని ప్రాజెక్టు ఆయకట్టుకు ప్రధాన కాలువ నుంచి నీటిని విడుదల చేయడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

మొక్కలు నాటిన రామారెడ్డి మండలవాసులు

జీహెచ్ఎంసీ అసిస్టెంట్ కమిషనర్ సునందనారెడ్డితో రామారెడ్డి మండలవాసులు

రామారెడ్డి, ఆగస్టు 10: మండలంలోని పోసానిపేట్ గ్రామానికి చెందిన సునందనారెడ్డి ప్రస్తుతం హైదరాబాద్ జీహెచ్ఎంసీలో అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆమెతో చదివిన 1993–94 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు శనివారం హైదరాబాద్‌లో కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ పరిధిలో వన మహోత్సవంలో భాగంగా మొక్కలను నాటారు. కార్యక్రమంలో బాల్య మిత్రులు శ్రీనివాస్, లింగం, రవి, రమేశ్, ప్రభాకర్ గుప్తా, శ్రీనివాస్ గౌడ్, పుష్పలత, శారద, లింబవ్వ తదితరులు పాల్గొన్నారు.

కోర్పోల్‌లో రక్తదాన శిబిరం

లింగంపేట, ఆగస్టు 10: మండలంలోని కోర్పోల్ గ్రామంలో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. శిబిరంలో 24 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్లు సొసైటీ ఎల్లారెడ్డి డివిజన్ అధ్యక్షుడు రవీందర్‌గౌడ్ తెలిపారు. కార్యక్రమంలో సొసైటీ మండల శాఖ అధ్యక్షుడు బొల్లు శ్రీకాంత్, సభ్యులు వివేకానంద, మాజీ సర్పంచ్ మంజులా నర్సింహులు, కాళీదాస్, రసూల్, కిష్టాగౌడ్, సొసైటీ సిబ్బంది ప్రమోద్ కుమార్, అమర్‌నాథ్, సాయి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

సమస్యల వలయంలో పెద్ద దేవీసింగ్ తండా

బురదమయంగా మారిన పెద్దదేవీసింగ్ తండాలోని రోడ్డు

- అస్తవ్యస్తంగా పారిశుద్ధ్యం
- అధ్వానంగా అంతర్గత రోడ్లు
- పత్తాలేని ప్రత్యేకాధికారి
- పట్టించుకోని పంచాయతీ అధికారులు

గ్రామంలో రోడ్డు పక్కనే చెత్తకుప్పలు

పెద్దకొడప్‌గల్, ఆగస్టు 10: స్వచ్ఛమైన వాతావరణం, శుభ్రతకు నిలయాలుగా ఉండాల్సిన తండాలు పారిశుద్ధ్యలోపంతో, సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నాయి. పంచాయతీ కార్యదర్శి పట్టించుకోకపోవడం, మండల ప్రత్యేకాధికారి పర్యవేక్షణ లేకపోవడంతో పెద్ద దేవీసింగ్‌సింగ్, మోర్‌సింగ్ తండా కాలనీలు దుర్గంధభరితంగా మారాయి. తండా ప్రధాన రహదారిపైనే మురికి నీరు నిలుస్తున్నది. దీంతో ఈగలు, దోమల బెడద పెరిగింది. నడవడానికి కూడా వీలు లేకుండా పోయిందని తండావాసులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. అంగన్‌వాడీ కేంద్రం నుంచి ప్రైమరీ పాఠశాల వరకు రోడ్డు పరిస్థితి మరీ దారుణంగా ఉన్నది. ప్రైడే – డ్రైడేను నామమాత్రంగా నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం కొనసాగుతున్న స్వచ్ఛదనం – పచ్చదనం కార్యక్రమం గ్రామంలో చేపట్టలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ తండాలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతున్నారు.

అధికారులు పట్టించుకోవడం లేదు..

తండాలో ప్రధాన రోడ్డు బురదమయంగా మారింది. తండాలో ఏ రోడ్డు పైన చూసినా మురికి నీరు ఉన్నది. మా సమస్యలు చాలాసార్లు అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదు. దోమల బెడద పెరిగి రోగాల బారిన పడుతున్నాం.

- మహేందర్, పెద్ద దేవీసింగ్ తండా

ఎమ్మెల్యే సారు స్పందించాలె..

పెద్దదేవీసింగ్ తండా పంచాయతీ సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నది. బురద, మురికి నీటితో దుర్వాసన వస్తున్నది. దోమలతో సీజన్ వ్యాధులు ప్రబలుతున్నాయి. అధికారులు పట్టించుకుంటలేరు. ఎమ్మెల్యే సారే స్పందించాలి.

- మచ్ఛేందర్, మోర్‌సింగ్‌తండా వాసి

బీజేపీ గిరిజన మోర్చా మండలాధ్యక్షుడి ఎన్నిక

గాంధారి, ఆగస్టు 10: బీజేపీ గిరిజన మోర్చా మండలాధ్యక్షుడిగా నున్సావత్ నవీన్‌నాయక్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు జిల్లా అధ్యక్షుడు బదావత్ నవీన్‌నాయక్ తెలిపారు. మండల కేంద్రంలో శనివారం సమావేశం నిర్వహించి నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. కార్యక్రమంలో జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కాట్రోత్ రవి, బీజేపీ మండలాధ్యక్షుడు మధుసూదన్‌రావు, గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి రంజిత్, నాయకులు నరేశ్, గబ్బర్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'ఓపెన్'లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

లింగంపేట, ఆగస్టు 10: ఓపెన్ ఎస్సెస్సీ, ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓపెన్ స్కూల్ కో–ఆర్డినేటర్ షౌకత్ అలీ ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్సెస్సీలో చేరే జనరల్ అభ్యర్థులు రూ.1550, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మైనార్టీలు రూ.1150, ఇంటర్‌లో చేరే జనరల్ అభ్యర్థులు రూ.1800, బీసీ, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మైనార్టీలు రూ.1500 ఆన్‌లైన్‌లో చెల్లించాలని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి సెప్టెంబర్ 10వ తేదీ వరకు గడువు ఉన్నదని తెలిపారు.

ఎస్సైకి సన్మానం

ఎస్సైని సన్మానిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

నాగిరెడ్డిపేట, ఆగస్టు 10: నాగిరెడ్డిపేట ఎస్సై మల్లారెడ్డిని బీఆర్ఎస్, ముదిరాజ్ సంఘ నాయకులు శనివారం వేర్వేరుగా సన్మానించారు. ఈ సందర్భంగా అతడికి శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గుర్రాల సిద్ధయ్య, సర్పంచుల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కృష్ణ, ఎంపీటీసీ ఫోరం మండల మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్, మాజీ ఎంపీటీసీ మాధవీ సంతోష్‌గౌడ్, ఏఎంసీ డైరెక్టర్ హన్మంత్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం మండల గౌరవ అధ్యక్షుడు గంపల వెంకన్న, మండలాధ్యక్షుడు చుక్క బాలయ్య, నాయకులు కృష్ణ, నారాయణ, నర్సింహులు పాల్గొన్నారు.

పోలీసులను దూషించిన యువకుడిపై కేసు నమోదు

గాంధారి, ఆగస్టు 10: విధులు నిర్వహిస్తున్న పోలీసులను దూషించిన యువకుడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై ఆంజనేయులు శనివారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కాటేవాడి తండాకు చెందిన బానోత్ రాజేశ్ శుక్రవారం సాయంత్రం గాంధారి ఎంపీడీవో కార్యాలయం మీదుగా ద్విచక్రవాహనంపై వేగంగా వెళ్తున్నాడు. పక్క నుంచి బైక్‌పై వెళ్తున్న పెద్దగుజ్జుల్ తండాకు చెందిన కన్నేరాం మెల్లిగా వెళ్లామని రాజేశ్‌కు సూచించాడు. దీంతో బైకును ఆపిన రాజేశ్.. కన్నేరామ్‌ను దూషిస్తూ అతడిపై దాడి చేయడంతోపాటు బైకును ధ్వంసం చేశాడు. ఈ విషయమై కన్నేరాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన రాజేశ్.. స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సిబ్బందిని దుర్భాషలాడడంతోపాటు అక్కడ ఉన్న ఫర్నిచర్‌ను చిందరవందర చేశాడు. ఈ విషయమై ఏఎస్సై గంగారాం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని రాజేశ్‌ను రిమాండ్‌కు తరలించామని ఎస్సై తెలిపారు.

రోడ్డుపై గుంతను పూడ్చిన పోలీసులు

గుంతను పూడుస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి రూరల్, ఆగస్టు 10: ఎల్లారెడ్డి – బాన్సువాడ ప్రధాన రహదారిపై తిమ్మారెడ్డి గేట్ వద్ద రోడ్డు మధ్యలో ఏర్పడిన గుంతను ఎల్లారెడ్డి ఎస్సై మహేశ్ ఆదేశాల మేరకు పోలీసులు శనివారం పూడ్చి వేశారు. గుంతను సంబంధిత అధికారులు పూడ్చివేయించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సమస్యను గుర్తించి పోలీసులు పూడ్చివేయడంతో వాహనదారులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో పెట్రోకార్ సిబ్బంది ఏఎస్సై విజయలక్ష్మి, హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్‌రెడ్డి, ఆంజనేయులు, బ్లూ కోట్స్ స్టాఫ్, బాబయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు లబాన్ సమాజ్ ర్యాలీ

గాంధారి, ఆగస్టు 10: శ్రావణ మాసం గోకులాష్టమి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం గాంధారిలో లబాన్ సమాజ్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు లబాన్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షుడు తాన్‌సింగ్ నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గోకులాష్టమి సందర్భంగా మండలంలోని అన్ని తండాల్లో జెండాలను ఆవిష్కరించనున్నట్లు పేర్కొన్నారు. మండల కేంద్రంలో ర్యాలీ అనంతరం స్థానిక లక్ష్మమ్మ ఆలయం వద్ద సమావేశం ఉంటుందని తెలిపారు. మండలంలోని లబాన్ లంబాడీలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.

ఫైర్‌మన్‌కు..

ఎల్లారెడ్డి, ఆగస్టు 10: ఉత్తమ సేవలను అందిం చి బదిలీపై వచ్చిన ఫైర్‌స్టేషన్ ఉద్యోగికి మద్నూర్ మండల నాయకులు శనివారం సన్మానించారు. మద్నూర్ ఫైర్‌స్టేషన్‌లో ఏడేండ్లు విధులు నిర్వహించిన లీడ్ ఫైర్‌మన్ వినోద్ పది రోజుల క్రితం ఎల్లారెడ్డికి బదిలీ అయ్యారు. ఆయన ఎల్లారెడ్డిలో బాధ్యతలను చేపట్టగా.. మద్నూర్‌కు చెందిన పలువురు నాయకులు ఎల్లారెడ్డి ఫైర్‌స్టేషన్ ఆవరణలో శనివారం సత్కరించారు. ఎల్లారెడ్డి ఫైర్ ఆఫీసర్ కిష్టయ్య, సిబ్బంది, మద్నూర్ నాయకుడు సంగమేశ్వర్ తదితరులు ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★I.DYAVARSHETTI SRINIVAS S/o. Gangadhar (Old name) R/o: 3-35 Thorthi ,Vill ,Yergatlla,Mdl,Nizamabad, Dist , (T.G). Changed My Name as DYAVARASHETTY SRINIVAS S/o GANGADHAR (New name)
NTZ-340261

CHANGE OF NAME

★I THEEGALA MADHUKAR REDDY R/o.H.No:6-99/1,Velpoor,Velpur,Nzb,T.S. I have Changed My Name /Surname as TEEGALA MADHUKAR.
NTZ-340237

CHANGE OF NAME

★I THEEGALA PADMA R/o.H.No:6-99/1, Velpoor, Velpur ,Nizamabab,Telangana. I have Changed My Name /Surname as TEEGALA PADMA.
NTZ-340237

PLOT FOR SALE

★"వరలక్ష్మీ వ్రతం" ఆఫర్... 1 ప్లాట్ బుకింగ్‌పై 2 గ్రాముల గోల్డ్ కాయిన్ ఫ్రీ... ఫ్రీ... 1 లక్షకే 121 గజాల ప్లాట్... ఎర్రచందనం మొక్కలతో నారాయణఖేడ్. Cont: 8500664291.
NT-332613

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
"పేరు మార్పిడి" ప్రకటన 4 లైన్లకు 250/-
ప్రతి అదనపు లైనుకు 50/- మాత్రమే
GST వర్తించును
సెల్: 91827 77590

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.